క్లుప్తంగా

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా కె.అనూష గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఆమె మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.గోపాలరావు తాడేపల్లి గూడెనికి బదిలీ అయ్యారు. కమిషనర్ ఎం.జశ్వంత రావు సెలవులో ఉన్నారు. ఆమె బాధ్యతలు స్వీకరించి, ఉద్యోగులతో కొద్దిసేపు మాట్లాడారు.

అమెరికాకు ఎన్టీఆర్ కాంస్య విగ్రహం



తెనాలిఅర్బన్: సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 7.6 అడుగుల కాంస్య విగ్రహాన్ని తయారు చేసినట్లు శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర గురువారం తెలిపారు. విగ్రహాన్ని అట్లాంట ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జార్జియా రాష్ట్రంలోని కమ్మింగ్ సిటీలో నిర్వాహకులు ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. మూడు కిలోల కంచుతో మూడు నెలల పాటు తయారు చేసినట్లు చెప్పారు. దీనిని త్వరలో అమెరికా తీసుకెళ్లనున్నట్లు వివరించారు.

వంటశాల నిర్మాణానికి శంకుస్థాపన



తెనాలిఅర్బన్: 13వ వార్డులోని కమ్యూనిటీ హాలులో వంట, భోజనశాలకు అవసరమైన నూతన షెడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీం గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.20 లక్షలతో షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ కుర్రా సుజాత, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను, భూషణం, పిల్లి వీరయ్య, కుర్రా చిన్న తదితరులు పాల్గొన్నారు.

8 మంది జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర గ్రామ శివారులో ఎనిమిది మంది పేకాట జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఆర్ రవీంద్రరెడ్డి గురువారం తెలిపారు. సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి, వారి నుంచి రూ.32,540లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండలంలో ఎక్కడైనా జూదం, కోడిపందేలు జరిగితే.. సమాచారం అందజేయాలని కోరారు.

రెగ్యులర్ తహసీల్దార్లుగా ఇద్దరికి పదోన్నతులు

గుంటూరు వెస్ట్: జిల్లాలో ఇద్దరిని రెగ్యులర్ తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకు ఓఎస్‌డీగా ఉన్న కోటంరాజు వెంకట గోపాలకృష్ణను చేబ్రోలుకు, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారికి సీసీగా పనిచేస్తున్న బి.వెంకటస్వామిని తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజినల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు.

ఉద్యోగాలకు 11 మంది ఎంపిక

తెనాలిఅర్బన్: స్థానిక ఎస్‌ఆర్‌కే అండ్ కేఎస్‌ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో టీఎంఐ గ్రూప్ సహకారంతో యాక్సిస్ బ్యాంక్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు బుధ, గురువారాలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బీకాం, బీఎస్సీ, బీబీఏ విద్యార్థులు 11మంది ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయకృష్ణ తెలిపారు. వారిని అభినందించారు. యాక్సిస్ బ్యాంక్ హెచ్‌ఆర్ మేనేజర్ పి.జయప్రకాష్, టీఎంఐ గ్రూపు ప్రతినిధులు సంజయ్ కృష్ణ, మణికందన్, బ్యాంకు ఉద్యోగులు అప్పలరాజు, శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేమెంట్ పవన్ కల్యాణ్ మాటలు హాస్యాస్పదం

గుంటూరు రూరల్: పేమెంట్ పవన్ కల్యాణ్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనూరి సతీష్‌శర్మ తెలిపారు. నగర శివారు ఇన్నర్ రింగ్ రోడ్డులోని సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం.. సోషల్ ఇంజినీరింగ్ అని చెప్పే పవన్ కల్యాన్ తన వారాహి వాహనంపై పదే పదే చెప్పే ఇతర సామాజిక వర్గాల నేతల్ని ఎందుకు ఎక్కించలేక పోయారని ప్రశ్నించారు. సామాజిక న్యాయం.. సోషల్ ఇంజినీరింగ్‌కి నిదర్శనం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అనే విషయాన్ని పవన్ కల్యాణ్ తెలుసుకోవాలని సూచించారు. రాజకీయమంటే రెండు గంటల సినిమా కాదని హితవు పలికారు. సినిమాలు ఆహ్లాదం కోసం మాత్రమే చూస్తారని తెలిపారు.

కష్టపడి చదివి.. లక్ష్యాలను చేరుకోండి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా
- 'జగనన్న ఆణిముత్యాలు'కు సన్మానం



విద్యార్థులతో జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీం

తెనాలిఅర్బన్: కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ప్రతి ఒక్కరూ చేరుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా సూచించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. నాడు–నేడు, జగనన్న విద్యాకానుక, జగనన్న వసతి దీవెన, అమ్మ ఒడి, గోరుముద్ద వంటి పథకాలను ప్రవేశపెట్టి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందని చెప్పారు. కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దాయనుకోవడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వం సన్మానించి, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారాయని చెప్పారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. పట్టణంలోని అనేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. అనంతరం పదో తరగతిలో 600 మార్కులకుగాను 580 మార్కులు సాధించిన తెనాలి కొత్తపటలోని బాలికల హైస్కూల్ విద్యార్థిని విన్నకొంట దక్షణ్య, తెనాలి మండలం పెదరావూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పల్లెకొండ రాజ్యలక్ష్మి (584), కొల్లిపర మండలం అత్తోట జడ్పీ హైస్కూల్ విద్యార్థి అద్దంకి గోవర్ధన నాయుడు (582) విద్యార్థులను సన్మానించి, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, తెనాలి నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరలేదని తప్పుడు ప్రచారాలు

– కొల్లిపర వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తెనాలిరూరల్: మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించగా.. తాను తిరస్కరించడంతో తనపై, తన కుటుంబంపై తప్పుడు ప్రచారాలు చేసి కేసులు పెట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ కొల్లిపర మండలాధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న ప్రతిసారి టీడీపీ నాయకులు ఈ విధంగానే చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక గంగానమ్మ పేటలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మండల పార్టీ నాయకులు పాల్గొని, మాట్లాడారు. పిడపర్రు గ్రామ చెరువు వ్యవహారంలో కొద్ది రోజులుగా టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. చంద్రారెడ్డి మాట్లాడుతూ, పిడపర్రు చెరువు వ్యవహారంలో టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పిడపర్రు సర్పంచ్ అనారోగ్యంతో ఉండటం వల్ల చెరువు అభివృద్ధి పనులకు తమను సంప్రదించారని, పంచాయతీ తీర్మానం మేరకే చెరువు సహా గ్రామాభివృద్ధి పనులు చేపట్టేందుకు తాము ముందుకొచ్చినట్లు చెప్పారు. తమపై, తమ వాహనాలపై వారు దాడి చేసి, మళ్లీ తమపైనే తప్పుడు కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలపాటి తనను టీడీపీలోకి ఆహ్వానించినా వెళ్లకపోవడం వల్లే ఈ తరహా దుష్ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో బేతాళ భూషణం, వేమూరి మోహనరావు, జొన్నా గోపీ, అత్తోట చంటి మాట్లాడారు. అవుతు నగేష్ రెడ్డి, అవుతు శేఖర్‌రెడ్డి, నాగరాజు, మంద్రు రాజు, పిల్లి గంగాధర్, బత్తుల రవి, వేముల శివ రామకృష్ణ, ప్రవీణ్, రవి, బాలరాజు, కిరణ్, ప్రకాశరావు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌సీలో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్



తెనాలిరూరల్: ముంబైలో గురువారం ప్రారంభమైన నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ తరఫున తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో తొలి రోజు వివిధ ప్రముఖ రాజకీయవేత్తలను కలిశారు. లోక్‌సభ మాజీ స్పీకర్లు మీరాకుమార్, సుమిత్రా మహాజన్‌లతో పాటు దేశ నలుమూలల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులతో చర్చించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ప్రత్తిపాడు ఎస్‌ఐ డి. రవీంద్ర బాబు హెచ్చరించారు. ప్రత్తిపాడుకు చెందిన చెవినేని వీరవసంతరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం స్పెషల్ బ్రాంచితో పాటు ఎస్‌ఐకు అందింది. దీంతో గురువారం సాయంత్రం ఎస్‌ఐ సిబ్బందితో దాడి చేశారు. అతని వద్ద నుంచి ఐదు 180 ఎం.ఎల్. బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


– వివరాలు వెల్లడించిన డీఎస్పీ జనార్ధనరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలిరూరల్: మన్యం జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి తెనాలి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఇద్దరు నిందితుల్ని తెనాలి రూరల్ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడికి చెందిన అబ్దుల్ రషీద్, పెదరావూరు గ్రామానికి చెందిన కోటంరాజు కామేశ్వరరావు నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు తెలిపారు. గురువారం సాయంత్రం తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. సంగం జాగర్లమూడి గ్రామానికి చెందిన అబ్దుల్ రషీద్ గతంలోనూ బైక్ దొంగతనాలు, నివాస గృహాల్లో చోరీలకు పాల్పడడం, గంజాయి విక్రయ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం అవన్నీ కోర్టుల్లో విచారణలో ఉన్నట్లు తెలిపారు. మన్యం జిల్లా జీకే వీధిలో బైక్‌పై గంజాయిని కొనుగోలు చేసే రషీద్ కిలో గంజాయిని రూ. 3000కు కొనుగోలు చేసి, తెనాలి పరిసర ప్రాంతాల్లో రూ.15 నుంచి రూ. 20 వేలకు ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఇతని వద్ద పెదరావూరుకు చెందిన కోటమరాజు కామేశ్వరరావు గంజాయి కొనుగోలు చేసి కొంత తాను వినియోగించుకుంటూ మరికొంత బయటి వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు పోలీసుల ద్వారా నిర్ధారణ అయిందని డీఎస్పీ వివరించారు. నిందితుడు రషీద్ సంగం జాగర్లమూడి లాకులు వద్ద గంజాయి విక్రయిస్తుండగా తెనాలి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో రూరల్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు, సిబ్బంది మణికుమార్, చలమారావు, శ్రీను ఉన్నారు.

18న జ్యేష్ఠాభిషేక మహోత్సవం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలస్వామిజీ, ట్రస్ట్ సభ్యులు

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలీగ్రామ మఠం ఆధ్వర్యంలో ఈ నెల 18న శ్రీవారి జ్యేష్ఠాభిషేక మహోత్సం నిర్వహిస్తున్నట్లు బాలస్వామిజీ తెలిపారు. విద్యాపీఠంలో గురువారం మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలస్వామిజీ మాట్లాడుతూ శనివారం శ్రీవారి రథోత్సవం, ఆదివారం జ్యేష్ఠాబిషేక మహోత్సవం జరుగుతుందని తెలిపారు. ప్రముఖ ప్రవచకులు డాక్టర్ చిదంబర శాస్త్రి తిరుమలక్షేత్ర వైభవం గురించి ప్రవచనం చేస్తారని తెలిపారు. భక్తులు పాల్గొని శ్రీవారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ సభ్యులు నంబూరు వెంకటకృష్ణమూర్తి, ఎం.రమణయ్య, గోవు రామకృష్ణ, చుందూరు లోకనాథం, ఉప్పల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శివనాగేశ్వరరావుకు చోటు



అవార్డును స్వీకరిస్తున్న శివనాగేశ్వరరావు

తెనాలి: తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు, కువైట్‌లోని చిత్రకళా ఉపాధ్యాయుడు అవనిగడ్డ శివ నాగేశ్వరరావు ఓ అరుదైన రికార్డును సాధించారు. కువైట్‌లోని అహ్మదీలోని పహాహీల్ అల్ వతనీహ ఇండియన్ ప్రైవేటు స్కూల్ (ఢిల్లీ పబ్లిక్ స్కూల్)లో ఫైన్ ఆర్ట్స్ డిపార్టుమెంట్ అధిపతిగా చేస్తున్న శివనాగేశ్వరరావు, తన 58 మంది విద్యార్థులతో కలిసి మైక్రోగ్రఫీలో యూకేకు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. వివిధ దేశాలు, పాఠశాలలు, వయసు సమూహాలకు చెందిన 58 మంది 2–12 తరగతుల విద్యార్థులు గత మే నెల 6వ మైక్రోగ్రఫీ ద్వారా కువైట్ జెండా, టవర్లు, లిబరేషన్ టవర్ చిత్రాలను రూపొందించిన సామూహిక ఈవెంట్‌కు ఈ రికార్డు లభించింది. స్కెచ్ పెన్నులు, బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్‌తో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ చిత్రకళ కొనసాగింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించటంతో ఈ నెల 7న శివనాగేశ్వరరావు, అతడి 58 మంది విద్యార్థులను సత్కరించారు. నాగేశ్వరరావుతోపాటు ఈవెంట్‌లో పాల్గొన్న అతడి కుమార్తెలు అవనిగడ్డ నేహ (12వ తరగతి), స్నేహ (6వ తరగతి) కూడా రికార్డు పత్రాలను అందుకున్నారు. కువైట్‌లోని భారత రాయబారి డాక్టర్ ఆదర్శ్ స్వైకా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కువైట్‌లోని రెండవ సెక్రటరీ (విద్య), ఎంబసీ ఆఫ్ ఇండియా అంచిత కేత్వాస్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అరుణ్‌చౌదరి, అల్‌రయన్ హోల్డింగ్ కంపెనీ, మైన్యూ వెర్షన్ ఎల్‌ఎల్‌సీ, షార్జా డైరెక్టర్ బాలసుబ్రమణియన్, ఇండియన్ ఫ్రంట్ లైనర్స్ అధ్యక్షుడు రామదాస్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు వెంటనే చేపట్టాలి

పెదకాకాని: రైతు భరోసా కేంద్రాల పరిధిలో భూసార పరీక్షలు వెంటనే చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పి. సంధ్యారాణి ఆదేశించారు. పెదకాకాని వ్యవసాయ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీఏఏల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చని ఆమె సూచించారు.

దోమల బెడద నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ ప్రియాంక

కొల్లిపర: కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. గురువారం మున్నంగి గ్రామంలో మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా హై స్కూల్ విద్యార్థులకు దోమల వల్ల కలిగే వ్యాధులను వివరించారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వంటి అనేక వ్యాధులు దోమల వల్ల వస్తాయని తెలిపారు. మురుగు నీరు నిల్వ లేకుడా చూడాలని, నిల్వ ఉన్న నీటిలో మడ్డి ఆయిల్, కిరోసిన్ పిచికారి చేయాలని చెప్పారు. విద్యార్థులు భోజనం ముందు, మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలన్నారు. సమాజ ఆరోగ్యాధికారిణి దాసరి స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, పీహెచ్‌ఎన్ కోటేశ్వరి, ఏఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ నెల 27 నుంచి యువతకు శిక్షణ తరగతులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వలి, చైతన్య, వెంకటేష్

తెనాలిఅర్బన్: ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30 వరకు రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సాంస్కృతిక సమ్మేళనం పేరిట గుంటూరులో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వలి, జంగాల చైతన్య తెలిపారు. గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం సమ్మేళనానికి సంబంధించిన కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో అనేక ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యువతకు అనేక అంశాలపై శిక్షణిచ్చేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు, ఏఐవైఎఫ్ నాయకులు పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్, కోలా శేఖర్, తలతోటి శ్రీను, ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తెనాలిఅర్బన్: భారత రాజ్యాంగ స్ఫూర్తితో పార్లమెంట్‌లో చేసిన కార్మిక చట్టాలు నేటికీ అమలు కావటం లేదని సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లిపర బాబుప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ తెనాలి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1948లో పార్లమెంట్‌లో ఆమోదించిన ఈఎస్‌ఐ చట్టాన్ని నేటికి అమలు చేయటం లేదని ఆరోపించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు షేక్ హుస్సేన్ వలి, ప్రధాన కార్యదర్శి మంగళగిరి వెంకటేశ్వర్లు, అధ్యక్షులు ఎం.పద్మ, కంచర్ల సుశీల, సరళారాణి, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, వెంకాయమ్మ, తిరుపతయ్య, ఆదాం, మేరి, బాబు, రాచూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



తెనాలిఅర్బన్: ప్రతిష్టాత్మకమైన జీ–20 సదస్సుకు భారతదేశం అధ్యక్షత వహించనున్న నేపథ్యంలో జీ–20 ఎడ్యుకేషనల్ వర్కింగ్ గ్రూప్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం చినరావూరులోని కేంద్రియ విద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి గురువారం వరకు ప్రతిరోజు అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రవికుమార్, కోచ్ అజయ్ పాల్గొన్నారు.

మట్టి పరీక్షతో రైతుకు గట్టి మేలు

- మట్టి స్వభావం తెలుసుకునేందుకు మంచి తరుణమిదే..
- రైతులకు ఎంతో ఉపయోగమంటున్న వ్యవసాయశాఖాధికారులు.
- దిగుబడులు పెరిగేందుకు దోహదం
- ఆర్‌బీకేల పరిధిలో మట్టి నమూనాల సేకరణ



పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయశాఖాధికారి, సిబ్బంది

చేబ్రోలు: భూసార పరీక్షలతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. పోషకాల సమతుల్యత పాటించేందుకు రసాయనిక ఎరువులు సరైన మోతాదులో వాడేందుకు ఎంతో అవసరం. పరీక్ష ఫలితాలకు అనుగుణంగా సాగు చేయడం వల్ల పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆశించిన దిగుబడులు వచ్చే అవకాశముంది. రైతులంతా ఇష్టారాజ్యంగా అధిక ఎరువుల వాడకం మూలంగా భూసారం దెబ్బతింటోంది. దీని దృష్ట్యా ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు ముందుగా మట్టి నమూనాల్ని సేకరించి భూసార పరీక్షలు చేయాలని నిర్ణయించింది.

మట్టి నమూనాల సేకరణ ప్రారంభం

ప్రస్తుతం పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) పరిధిలో వ్యవసాయశాఖాధికారులు, సిబ్బంది పరీక్షలు నిర్వహించేందుకు మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. చేబ్రోలు మండలంలోని 17 ఆర్‌బీకేల ద్వారా మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపారు. దీంతో పాటు భూ సార పరీక్ష వల్ల కలిగే లాభాల్ని రైతులకు వివరిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో తరుణమిదేనని సూచిస్తున్నారు. మండలంలోని ప్రధానంగా వరి, మిర్చి, పత్తి, కూరగాయ పంటలు, అపరాలు తదితర పంటల్ని సాగు చేస్తున్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధి నుంచి 20 మట్టి నమూనాలను సేకరించి గుంటూరు భూసార పరీక్షా కేంద్రానికి పంపుతున్నారు. గతంలో మాదిరి కాకుండా ఈ ఏడాది కచ్చితమైన భూసారాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక యాప్ ద్వారా మట్టి నమూనాల సేకరణ జరుగుతున్నట్లు తెలిపారు.

పోషకాల సమతుల్యతతో అధిక దిగుబడులు

పొలంలో సూక్ష్మ పోషకాలు లోపించకుండా రైతులంతా శ్రద్ధ తీసుకోవాలి. జింకు, బోరాన్, జిప్సమ్ లోపాల్ని సవరించడం వల్ల అధిక దిగుబడులు పెంచుకునేందుకు వీలు కలుగుతుంది. ఖరీఫ్ సాగుకు ముందుగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మంచిదని వ్యవసాయశాఖాధికారులు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

- పొలాల్లోని ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు.
- మట్టి పరీక్ష ఫలితాలతో ఏ పంట వేయాలి.. ఏయే ఎరువులు ఎంత మోతాదులో వేయాలి అనే విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది.
- పంట పొలాల్లో చౌడ ఆమ్ల స్థాయిని నిర్ధారించి వాటిని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించే అవకాశం ఉంది.
- రసాయన ఎరువులపై అనవసర ఖర్చును తగ్గించుకునే అవకాశం ఉంది.

రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం



ప్రత్తిపాడు: రైతులకు యాభై శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నట్లు ఏవో అరుణకుమారి తెలిపారు. ఇప్పటికే స్టాక్‌ను రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసినట్లు చెప్పారు. విత్తనాలు కావాల్సిన రైతులు కేంద్రాల్లోని సిబ్బందిని లేదా వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు. ప్రతిపాడు ఆర్‌బీకేలో పిల్లిపెసర 1.6 క్వింటాళ్లు, గొట్టిపాడులో పిల్లిపెసర 2.4 క్వింటాళ్లు, గనికపూడిలో పిల్లిపెసర 1.6 క్వింటాళ్లు, యనమదలలో పిల్లిపెసర 6.4, జనుము 2 క్వింటాళ్లు, పాతమల్లాయపాలెంలో పిల్లిపెసర 2.4, జీలుగ క్వింటా, జనుము క్వింటా, వంగిపురంలో పిల్లిపెసర 2.4, జనుము 10 క్వింటాళ్లు ఉన్నట్లు ఆమె వివరించారు. యాభై శాతం రాయితీ పోనూ జీలుగ విత్తనాలను కేజీ రూ. 39.50, జనుము విత్తనాలను రూ. 42, పిల్లిపెసర విత్తనాలను రూ. 48.50 అందిస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు పది కేజీల చొప్పున ఒక్కో రైతుకు ఐదెకరాల వరకూ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.